ప్రజాశక్తి
మంగళవారం 30 మే 2023
5
అల్లూరి సీతారామరాజు

ట్రాక్టర్‌ను ఢీకొన్న బస్సు

ప్రజాశక్తి-పెదబయలు:మండల కేంద్రంలో సోమవారం జరిగిన సంతలో పాడేరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సెంటైన్స్ స్కూల్ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొంది. ప్రయాణికులకు ప్రమాదం కలగక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. పోలీ సులు ట్రాఫిక్‌ను క్రమబద్ధం చేశారు. మోదకొండమ్మ జాతర నేపథ్యంలో భక్తుల రద్దీతో ప్రమాదాలు జరగకుండా పోలీసులు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రాఫిక్‌ను సరిచేస్తున్న పోలీసులు

సమస్యలు పరిష్కరించాలని..

మన్యంలో యానిమేటర్ల ఆందోళన

అరకులోయలో ఆందోళన చేపడుతున్న యానిమేటర్లు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:యానిమేటర్లకు మూడు సంవత్సరాల కాల పరిమితిని రద్దు చేయాలని, బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ, మూడేళ్ల కాల పరిమితికి సంబంధించి ప్రభుత్వ సర్క్యులర్ తీసుకురావడంతో అనేకమంది ఉపాధి కోల్పోతారని చెప్పారు. యానిమేటర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కే.బుచ్చిబాబు, జాన్, యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో...

ముంచింగిపుట్టు:మండలంలో వెలుగు వివోఏ యానిమేటర్లు సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం సమ్మెను నిర్వహించారు. ఈ సందర్భంగా వివోఏ సంఘం అధ్యక్షురాలు జ్యోతి మాట్లాడుతూ, మూడు సంవత్సరాల కాల పరిమితి సర్కిలర్ రద్దు చేసి, వివో ఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. హెచ్ఆర్ పాలసీ అమలు చేసి, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. బకాయి పడ్డ వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. లోకో యాప్ పనుల నిమిత్తం ఫైవ్ జి మొబైల్‌ను ప్రభుత్వమే ఇవ్వాలని, వయోపరిమితి, చదువు ఉత్తీర్ణత పేర్లతో వివోఏల తొలగింపులు ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజారావు, రామలక్ష్మి, గౌతం పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని విఓఎలు వెలుగు కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఉద్యోగ భద్రత కల్పించి, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని విఎఎలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విఓఏ లు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్:రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఐకెపి కార్యాలయం ముందు ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉద్దేశించి వివోఏ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్బి రాజ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వివోఏల పట్ల చిన్నచూపు చూస్తుందన్నారు.వివోఏలను తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేయడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, చిన్న, పార్వతి, దున్ను, తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి:వివోఏల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని స్థానిక జెడ్పిటిసి దీసరి .గంగరాజు తెలిపారు. స్థానిక

అనంతగిరిలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

వెలుగు కార్యాలయం వద్ద వివోఏల నిరసనలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, పొదుపు సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్న వివోఏ లను తొలగిం చేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు.ఐటీడీఏ పాలకవర్గం, జిల్లా పరిషత్ సమావేశంలో ప్రస్తావించి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామి ఇచ్చారు. టోకురు సిపిఎం సర్పంచ్ కిలో. మొస్య, సిపిఎం మండల కార్యదర్శి ఎస్. నాగులు, గిరిజన సంఘం మండల కార్యదర్శి జె .సుబ్బరావులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివోఓల యూనియన్ నాయకులు ఎం. రంజిత, కె. దిలీప్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టలో....

మరమ్మతు పనులు చేస్తున్న ఎపి జెన్‌కో ఇంజనీర్లు, కార్మికులు

శరవేగంగా నాలుగో యూనిట్ మరమ్మతు పనులు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు జల విద్యుత్తు కేంద్రంలో నాలుగో యూనిట్ మరమ్మతు పనులు సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీరు బొడ్డు శ్రీధర్ పర్యవేక్షణలో శరవేగంగా నిర్వహిస్తున్నారు. మరమ్మతు పనులను అభిరామ కంపెనీకి అప్పగించారు. నాలుగో యూనిట్ ఏప్రిల్ 19న సాంకేతిక లోపల తలెత్తి మరమ్మతులకు గురైన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి యూనిట్ మరమ్మతు పనులు మొదలుపెట్టారు. సోమవారం నాటికి 40 రోజులు గడుస్తున్నా మరమ్మతు పనులు పూర్తికాలేదు. దీంతో నాలుగవ యూనిట్ నుంచి విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడంతో ఏపీ జెన్కో ఆదాయానికి భారీ నష్టం కలిగిందని చెప్పవచ్చు. నాలుగో యూనిట్ ట్రస్ట్ బేరింగ్ గైడ్ బేరింగ్స్ మరమ్మతులు గురు కావడంతో యూనిట్‌లో ఉన్న రోటర్ పరికరాన్ని భారీ క్రేన్‌తో సోమవారం ఏపీ జెన్కో ఇంజనీర్లు కార్మికులు సహాయంతో బయటికి తీశారు. అనంతరం యూనిట్‌లో ఉన్న సాంకేతిక లోపాలను చీఫ్ ఇంజనీర్ శ్రీధర్ పర్యవేక్షణలో పరిశీలించారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 4వ యూనిట్ మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, మిగతా మూడు యూనిట్లు విద్యుత్ ఉత్పత్తికి అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

రహదారికి అడ్డంగా కూలిన చెట్టు

జాతీయ రహదారిపై కూలిన భారీ వృక్షం

రాకపోకలకు తీవ్ర అంతరాయం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని సూరంపాలెం గ్రామ శివారులో 516ఈ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం భారీ వృక్షం నేలకొరింది. దీంతో ఏలేశ్వరం -నర్సీపట్నం వెళ్లే ప్రధాన జాతీయ రహదారిపై గంటల తరబడి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉదయం నుండి తీవ్రమైన ఎండకాసి, సాయంత్రానికి ఒక్కసారిగా ఆకాశంలో నల్ల మబ్బులు కమ్ముకొని ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు సూరంపాలెం సమీపంలో జాతీయ రహదారిపై భారీ వృక్షం వేళ్ళతో సహా రహదారికి అడ్డంగా కూలిపోయింది. దీంతో నర్సీపట్నం-రాజవొమ్మంగి మార్గంలో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. రాజవొమ్మంగి ఎస్సై టీజీ నరేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది, గ్రామస్తులు సహకారంతో వృక్షాన్ని రోడ్డు పైనుండి తొలగించారు. ఈదురుగాలుల కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

వరి విత్తనాలు సిద్ధం

ప్రజాశక్తి-కొయ్యూరు

ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన వరి విత్తనాలను సిద్ధం చేశామని వ్యవసాయశాఖ ఏవో ఏ.కృష్ణవేణి తెలిపారు. సోమవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని 8 రైతు భరోసా కేంద్రాల పరిధిలో రైతులకు ఎంతమేరకు విత్తనాలు అవసరమవుతాయో గుర్తించామన్నారు. ఈ మేరకు 1,150 క్వింటాళ్ల వరి విత్తనాలకు ప్రతిపాదన చేశామని తెలిపారు. 22 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలకు కూడా ప్రతిపాదనలు పంపించినట్లు చెప్పారు. త్వరలోనే ఆర్‌బికెల వారీగా విత్తనాలు సరఫరా అవుతాయని, ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం కావాలని సూచించారు.

స్పందన అర్జీల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - రంపచోడవరం

స్పందన కార్యక్రమంలో పలు సమస్యలపై వచ్చిన అర్జీల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే ఆదేశించారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశపు హాల్లో జరిగిన స్పందన కార్యక్రమంలో పిఓతో పాటు సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఐటిడిఎ ఏపీవో సిహెచ్.శ్రీనివాసరావు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. 36 దరఖాస్తులు వచ్చాయి. అడ్డతీగల గ్రామంలో ఇళ్ల స్థలం సమస్యను పరిష్కరించాలని, వై.రామవరం మండలం కె.ఎర్రగొండ పంచాయతీ పాముల మామిడి గొంది గ్రామంలో తాగునీరు బోరు ఏర్పాటు చేయాలని, రంపచోడవరం మండలం పందిరి మామిడి జంక్షన్ నుండి వై.రామవరం మండలం చవటి దిబ్బలు గ్రామాల మధ్యలో 42 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి పది కిలోమీటర్ల మేరకు ఆగిపోయిన ఫారెస్ట్ క్లియరెన్స్ ఇచ్చి రోడ్డు పూర్తి చేయాలని తదితర సమస్యలపై దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎండి యూసఫ్, నాగేశ్వరరావు, వెలుగు ఏపిడి ఏ.శ్రీనివాసరావు, హార్టికల్చర్ అధికారి రాంబాబు, ఏఎంవో సి.శ్రీహరి, వైద్యాధికారులు డాక్టర్ రాధి, డాక్టర్ కల్పన, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సాయి సతీష్, ఎ.వెంకటేశ్వరరావు, రాజేంద్ర బాబు, రామచంద్రమూర్తి, దుర్గాప్రసాద్, చైతన్య, మలేరియా శాఖ అధికారి నక్క వెంకటేశ్వరరావు, ఏఈ ఎంవివి సత్యనారాయణ, డిప్యూటీ తహశీల్దారు చైతన్య బాబు, గిరిజన సంక్షేమ శాఖ డిడి కార్యాలయ సూపరింటెండెంట్ బి.కిషోర్, జిసిసి సీనియర్ మేనేజర్ ఎం.నాగ వెంకట రాజారెడ్డి, డిపిఎం పరమేశ్వరరావు, లీగల్ సెల్ న్యాయవాది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు,

ప్రజల సమస్యలు వింటున్న అధికారులు

పాడేరులో పాత్రికేయుల నిరసన

ప్రజాశక్తి-పాడేరు టౌన్: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు జర్నలిస్టుల డిమాండ్స్ డే సందర్భంగా సోమవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో జర్నలిస్టులు నిరసన చేపట్టారు. కలెక్టర్ కార్యాలయం వద్ద జర్నలిస్టుల సమస్యలపై నిరసన ప్రదర్శన చేసి, అనంతరం డిఆర్‌ఓ అంబేద్కర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. జర్నలిస్టులపై దాడుల నివారణకు కమిటీని నియమించాలని, కార్మిక భీమా వర్తింపజేయాలన్నారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, అధికారులు కృషి చేయాలని పాత్రికేయులు కోరారు. ఈ కార్యక్రమంలో విలేకరులు చక్రవర్తి, సూర్యారావు, రామచంద్రుడు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

స్కూల్ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: నాడు నేడు పథకంలో భాగంగా మండలంలోని బోడిగూడ, బల్లుగూడ అంగన్వాడి కేంద్రంలో నిర్మిస్తున్న సాటిలైట్ స్కూల్లో నిర్మాణ పనులను అల్లూరి జిల్లా ఐసిడిఎస్ పిడి సూర్యలక్ష్మి సోమవారం పరిశీలించారు. పనుల నిర్మాణాల నాణ్యతను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో సందర్శించి కిశోర బాలికలకు అందిస్తున్న పౌష్టికాహారం పై అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం పై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ నీలిమ, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ఐసిడిఎస్ పీడీ

జెసితో మాట్లాడుతున్న గంగరాజు, రూతు

పంచాయతీ వాటా చెల్లించాలని

జెసికి జెడ్‌పిటిసి, సర్పంచ్‌ల వినతి

ప్రజాశక్తి-అనంతగిరి:స్థానిక హరితహిల్ రిసార్ట్స్ నుంచి వచ్చే ఆదాయాన్ని పంచాయతీ వాటా కింద చెల్లించాలని జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ కు స్థానిక జెడ్పిటిసి దీసరి. గంగరాజు, స్థానిక సర్పంచ్ సోమల. రూతు కలిసి లిఖితపు రంగా విన్నవించారు. సోమవారం మండలంలో పర్యటనకు వచ్చిన సందర్భంగా మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద సమస్యలను తెలిపారు ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, పర్యాటక శాఖ హరిత హిల్ రిసార్ట్సులో వచ్చే ఆదాయంలో 25శాతం పంచాయతీకి వాటాతో పాటు పన్ను చెల్లించవలసి ఉందన్నారు. పర్యాటక శాఖ నుండి ఆదాయాన్ని చెల్లించలేదని, ఈ ఏడాది నుండైనా వాటా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.బొర్రా గుహల్లో స్థానికులకు ఉచితంగా ప్రవేశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.నాగులు, గిరిజన సంఘం మండల కార్యదర్శి, వార్డ్ మెంబర్ జె.సుబ్బారావు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:రైతులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సబ్సిడీ విత్తనాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మండల ఎంపీపీ బి.ఈశ్వరి సూచించారు. సబ్సిడీ వరి విత్తనాలను మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో సోమవారం రైతులకు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సబ్సిడీ విత్తనాలు మండల వ్యాప్తంగా 16 గ్రామ సచివాలయ రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యవసాయం సాగు చేస్తున్న అర్హులైన ప్రతి ఒక్క రైతుకు ఈ సబ్సిడీ విత్తనాలను అందజేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సిహెచ్ జానకమ్మ, మండల వ్యవసాయ అధికారిని నీలవేణి, సర్పంచ్ వి.వెంకట్రావు, ఉపసర్పంచ్ జగ్గు నాయుడు, వైసిపి మండల నాయకుడు బి.సింహాచలం, వార్డు సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు ఇస్తున్న ఎంపిపి

మహిళకు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలో బీమవరం పంచాయతీ చిట్టంపాడు గ్రామంలో ఆదివారం భారీ వర్షం కారణంగా ఓ మహిళకు స్వల్ప గాయాలు అయ్యాయి. ఇంటిలో గేమ్మెలి గౌరీ ఉండగా చెట్టు ఆకస్మికంగా పడిపోయింది. దీంతో, స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ నైని సన్నీ బాబు బోయిని శ్రీదేవి, గ్రామస్తులు సాయంత్రం 108 కి ఫోన్ చేసి జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. ప్రస్తుతానికి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ క్షేమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆశ్రమ పాఠశాలల్లో వర్కర్ పోస్టులు పెంచాలి

సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

ప్రజాశక్తి-చింతూరు

గిరిజన ఆశ్రమ పాఠశాలలో అవుట్ సోర్సింగ్ వర్కర్ పోస్టులను పెంచాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వర్కర్లను నియమించాలని, ప్రస్తుతం పని చేస్తున్న వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం చింతూరు బాలికల ఆశ్రమ స్కూల్లో సోడి దుర్గారావు అధ్యక్షతన జరిగిన ఆశ్రమ స్కూల్ వర్కర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న వర్కర్ల చేత ప్రభుత్వం వెట్టి చాకిరీ చేస్తుందని విమర్శించారు. 100 మంది విద్యార్థులకు ఒక కుక్, ఒక కమాటీ, ఒక వాచ్‌మెన్ ఉండాల్సి ఉండగా 400 నుండి 500 మంది విద్యార్థులు ఉన్న చోట కూడా ఐదుగురితో పని చేయిస్తున్నారని తెలిపారు. అధిక పని భారం వల్ల వర్కర్లు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పై సమస్యలను పరిష్కరించాలని, సంక్షేమ పథకాలు ఆశ్రమ పాఠశాల వర్కర్లకు వర్తింపజేయాలని, పాఠశాల ప్రాంగణంలోనే క్వార్టర్స్ వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. కళాశాల హాస్టల్ వర్కర్ల పోస్టులను వారికే కేటాయించాలని, ఎండాకాలం సెలవు దినాల్లో కూడా జీతాలు ఇవ్వాలని, మండల యూనిట్ ప్రాతిపదికన కౌన్సిలింగ్ నిర్వహించి బదిలీలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రమ్మ, రాంబాబు, చెల్లెమ్మ, ముత్తమ్మ, శాంతమ్మ, జానకమ్మ, సీతమ్మ, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు పల్లపు వెంకట్

తాగునీటి సమస్యపై ఖాళీ బిందెలతో నిరసన

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మారేడుమిల్లి మండల కేంద్రంలోని చెలక వీధి, దొరలవీధిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆ కాలనీల గిరిజన మహిళలు సోమవారం ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. అనంతరం ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజుల నుండి తాగునీరు లేక తీవ్ర అవస్థలను ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. పలుమార్లు సంబంధిత అధికారులకు సమస్య తెలిపిన పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ సిబ్బందికి పలుమార్లు విన్నవించుకున్నా ఫలితం లేదన్నారు. గత్యంతరం లేక నిరసన చేపట్టినట్లు పేర్కొన్నారు. తక్షణమే తమ సమస్యను పరిష్కరించాలని, లేకుంటే పై అధికారులకు తెలియజేస్తామని ఎంపీడీవోకు స్పష్టం చేశారు.

ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- కొయ్యూరు

మండలంలోని తులబాడ గెడ్డ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం చెందారు. స్థానికులు, కొయ్యూరు పోలీసుల కథనం ప్రకారం.... సోమవారం ఉదయం నర్సీపట్నం నుంచి చింతపల్లి వైపు వెళ్తున్న టాటా మేజిక్ వాహనం, ఎదురుగా తవుడు లోడ్‌తో వస్తున్న బొలెరో వాహనం కొయ్యూరు మండలం తులబాడ గెడ్డ గ్రామ సమీపంలోకి వచ్చే సరికి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నర్సీపట్నానికి చెందిన తవుడు వ్యాపారి సత్యరాజు (50) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారిలో నలుగురు పరిస్థితి విషమంగా ఉన్నట్లు కొయ్యూరు ఎస్ఐ రాజారావు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న ప్రజాప్రతినిధులు

సమస్యలపై ఉపాధి కూలీల గళం

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలో డి.చింతలవీది, దాలిగుమ్మడిలో ఉపాధి హామీ పనులను స్థానిక జెడ్పీటీసీ, సర్పంచ్‌లు పరిశీలించారు.విఆర్‌పి సరిగ్గా మస్టర్లు వేయలేదని, పనులు పరిశీలించ లేదని లబ్దిదారులు జెడ్పిటిసి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో చేసిన పనులకు మాస్టర్లు వేయక పోవడంతో డబ్బులు అకౌంట్లో జమ కాలేదని ఆవేదన వెలిబుచ్చారు. ఉపాధి పనులు చేసినప్పుడు ఫొటోలు తీసి అప్లోడ్ చేయాల్సి ఉండగా విఆర్‌పి పర్యవేక్షణ లేక మేట్లతో చేయిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ విషయంపై జడ్పిటిసి రేగం మత్స్యలింగం వీఆర్‌పిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో, ఏపీవో లకు ఫోన్‌లో విషయాన్ని తెలియజేశారు.. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా చేస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి నైని సత్తిబాబు, నాయకులు పాంగి అనిల్, సర్పంచ్ వెంకట పూర్ణిమ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన చట్టాల అమలుకు వినతి

ప్రజాశక్తి-పాడేరుటౌన్: అల్లూరి జిల్లాలోని పాడేరు, అరకు నియోజకవర్గాల్లో గిరిజన హక్కులు, చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ ఆదివాసి సంక్షేమ పరిషత్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.నాగేశ్వరరావు ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన ప్రాంతంలో ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న గిరిజనేతరులపై తక్షణమే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. 1/70, పీసా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాడేరు ఏజెన్సీ వ్యాప్తంగా ఆక్రమణల దుకాణాల తొలగింపు చర్యలను చేపట్టాలని కోరారు. టిడబ్ల్యూ డిప్యూటీ కలెక్టర్ ను కలిసిన వారిలో గిరిజన సంక్షేమ పరిషత్ కమిటీ సభ్యులు పి.చిరంజీవి, కె.కామరాజు, పాంగి చిరంజీవి, కె.దేవదాసు, ఎస్.నాగరాజు, పి.అర్జున్, కె.సోమన్న, పి.అర్జున్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వ్యాయామం చేస్తున్న చిన్నారులు

వ్యాయామంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో భాగంగా సోమవారం చిన్నారులకు చిన్నారులు వ్యాయామం చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిని ఎస్.సునీత మాట్లాడుతూ వ్యాయామం శారీరక దృఢత్వానికి, సంపూర్ణ ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది కే.సుబ్బారావు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన రహదారి పనులు

బిల్లులు చెల్లించకపోవడంతో మట్టి వేసి వదిలేసిన కాంట్రాక్టర్

వర్షాలకు అవస్థలు పడుతున్న పాదచారులు, వాహనదారులు

మట్టి వేసి వదిలేసిన రోడ్డు

ప్రజాశక్తి హుకుంపేట: మండలంలోని తీగల వలస పంచాయతీ పంసబంద, కిన్నెరులోవ గ్రామాల్లోని రహదారి పనులు నత్తనడకన సాగడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 2018ఏడాదిలో పంసబంద, కిన్నెరులోవ గ్రామాలకు రహదారి పనులు ప్రారంభించారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించక పోవడంతో మట్టి రోడ్డు వేసి పనులు నిలిపి వేశారు.

. పంసబందలో 40కుటుంబాలు 185 మంది జనభా, కిన్నెరులోవలో 35 కుటుంబాలు 165 జనాభా కలిగి జీవనం సాగిస్తున్నారు. గతంలో నిత్యం డోలి మోతలతో ఇక్కట్లు పడుతున్నారు. నిత్యావసర సరుకులు, రేషన్ సరుకులు నెత్తిమీదుగా మోసుకుని ఇదే రహదారిపై రాకపోకలు కాలిబాటన సాగిస్తుండంతో గ్రామ ప్రజలు, సీపీఎం నేతలతో రహదారి నిర్మాణం చేపట్టాలని గతంలో పోరాటం చేసారు. దీంతో, 2018 సంవత్సరంలో సుమారు కోటి ఇరవై లక్షల నిధులు ఈ రెండు గ్రామాలకు మంజూరు చేసారు. తీగల వలస పంచాయతీ పనసబంద నుండి కిన్నెరులోవ వరకు 4కిలోమీటర్ల వరకు మెటల్ రోడ్డు గ్రాంటు అయ్యింది. మట్టితో రహదారి ఏర్పాటు చేసి మధ్యలో మానేశారు. చాలాకాలం నుండి అధ్వానంగా రహదారి ఉంది. ఇటీవల కాలంలో కురిసిన భారీ వర్షాలకు రహదారి కోతకు గురైంది. కొత్తకు గురైన రోడ్డును ఎన్నోమార్లు గ్రామ ప్రజలు శ్రమదానంతో గుంతలు పూడ్చి మరమ్మతులు చేపట్టారు.రహదారి సౌకర్యం సరిగ్గా లేక పోవడంతో వాహనాలు గ్రామంలోకి వచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

ఇది ఇలా ఉండగా తీగలవలస మేజర్ పంచాయతీ కావడంతో అభివృద్ధి నోచుకోక పోవడంతో ఎంపీపీ కూడా రాజబాబు పదవి బాధ్యతలు స్వీకరించిన తర్వాత తీగల వలస పంచాయతీని దత్తత తీసుకున్నారు. ఇప్పటి వరకు పంచాయతీ అభివద్ధి పనులు నోచుకోలేక అమడ దూరంలో ఉండి సమస్యతో స్వాగతం పలుకుతుంది.

రోడ్డు పనులు పూర్తి చేయాలి

రహదారి సమస్య పరిష్కారానికి నోచుకోక పోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వారపు సంత, రేషన్, అటవీ ఉత్పత్తులు తెచ్చుకునేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నాం.

సీదారి సురిబాబు
పనసబంద గ్రామం
తీగలవలస పంచాయతీ.

హామీలు మరిచారు

ఎంపీపీ జోక్యం చేసుకుని రహదారి నిర్మాణ పూర్తి చేయాలి. 6సంవత్సాలు అవుతున్నా రహదారి ప్రారంభ దశలో ఉంది.దీంతో గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.దత్తత తీసుకున్నా అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు.

పాంగి సోమన్న,
గిరిజన సంఘం మండల అధ్యక్షులు

కాంగ్రెస్ ఆధ్వర్యాన సంతకాల సేకరణ

సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: బోయ/వాల్మీకులను, బెంతులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి కేబినెట్ సమావేశంలో తీర్మానం చేయడాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక కాంగ్రెస్ పార్టీ పిసిసి ప్రతినిధి పి.చిన్నస్వామి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా పిసిసి ప్రతినిధి చిన్నస్వామి మాట్లాడుతూ, అన్ని రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందిన వారిని చేర్చడంతో గిరిజనులు తీవ్రంగా నష్టపోతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి టి భీమారావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జి మదనరావు, మండల నాయకులు కే రాము తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితునికి జీవిత ఖైదు

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో ఉర్లమెట్ట గ్రామంలో 2021 సంవత్సరం ఆగస్టు నెలలో తన భార్య సంపతి భానుమతికి వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో ఆమె భర్త సోమిలి శివప్రసాద్ కత్తితో హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సబంధించి సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావులు ఈ హత్యకు సంబంధించిన ముఖ్యమైన సాక్షధారాలను సేకరించి కోర్టులో నిందితుడిని హాజరు పరిచినారు. భర్త సోమల శివప్రసాద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి దర్యాప్తును పూర్తి చేసి, ఛార్జ్ షీట్ కోర్టులో సమర్పించారు. విశాఖపట్నం మహిళ కోర్టులో బాధిత మహిళ తరపున లాయర్ .శైలజ కోర్టులో వాదనలను వినిపించారు. సాక్షాదారాలను బట్టి జడ్జ్ నిందితుడికి జీవిత ఖైదు(కఠిన కారాగార శిక్ష), వెయ్యి రూపాయల జరిమానా విధించినట్టు స్థానిక సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాస్ సోమవారం తెలిపారు

భోజనాలు చేస్తున్న భక్తులు

భారీ అన్నసమారాధన

ప్రజాశక్తి-పెదబయలు: మండల కేంద్రంలో మోద కొండమ్మ జాతర నేపథ్యంలో ఆలయం వద్ద భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం పూర్వ అధ్యక్షుడు బి.సన్నీబాబు, టి ఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు టి.జగత్ రాయ్, రాష్ట్ర ఆగ్రో డైరెక్టర్ వనాల్బ సన్యాసి, ఉత్సవ కమిటీ అధ్యక్షులు మజ్జి చంద్రు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు లోచలి విశ్వనాదం, వైసిపి నాయకులు గంపరాయి సూరయ్య, టిడిపి నాయకులు సల్లంగి రవికుమార్‌లు పాల్గొన్నారు

ఎసిబికి చిక్కిన విఆర్ఒ

ప్రజాశక్తి -గోపాలపట్నం : విశాఖ రూరల్ విఆర్ఒ జామి రాము రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు సోమవారం పట్టుకున్నారు. ఘటనకు సంబంధించిన వివరాలను ఎసిబి ఎసిపి శ్రావణి గోపాలపట్నం తహశీల్దార్ కార్యాలయంలో విలేకర్లకు వివరించారు. గోపాలపట్నం పరిధి బుచ్చిరాజుపాలెంలో 22ఎ లో చేరిన ఇంటి స్థలాన్ని ఆ జాబితా నుంచి తొలగిస్తానని చెప్పి విఆర్ఒ లంచం తీసుకుంటున్నారని తెలిపారు. వన్ టౌన్ ప్రాంతానికి చెందిన 80 ఏళ్ల వ్యక్తికి గోపాలపట్నం పరిధి బుచ్చిరాజుపాలెంలో 22 ఎలో చేరిన ఇంటి స్థలం ఉంది. తనకు ఉన్నతాధికారులు వద్ద మంచి పలుకుబడి ఉందని, సింహాచలం దేవస్థానం ప్రోటోకాల్ డ్యూటీ కూడా చేస్తానని, దీని వల్ల 22 ఎ జాబితా నుంచి ఆ ఇంటి స్థలాన్ని తప్పిస్తానని వృద్ధునికి విఆర్ఒ చెప్పాడు. దీని కోసం రూ. 30 వేలు లంచం డిమాండ్ చేశాడు. అడ్వాన్సుగా రూ.10 వేలు ఇవ్వాలని కోరాడు. బాధితుడు ఎసిబిని ఆశ్రయించాడు. ఎసిబి అధికారుల ప్లాన్ ప్రకారం... టౌన్ కొత్త రోడ్డు వద్ద ఉన్న విఆర్ఒ రాము ఇంటికి బాధిత వృద్ధుడు వెళ్లి రూ.10 వేలు ఇస్తుండగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. గోపాలపట్నం తహశీల్దార్ కార్యాలయంలో అధికారులు తనిఖీలు ప్రారంభించారు. ఇందులో ఇంకెవరి పాత్ర ఉందేమోనని ఆరా తీస్తున్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి రమణమూర్తి, ఇన్స్పెక్టర్లు సతీష్‌కుమార్, కిషోర్‌కుమార్, రామకృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రూ.50 కోట్లతో గీతం పరిశోధనా కేంద్రాలు

ప్రజాశక్తి-విశాఖపట్నం : శాస్త్ర పరిశోధనలను బలోపేతం చేయడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం రూ.50 కోట్లతో పరిశోధనా కేంద్రాలను అభివృద్ధి చేస్తోందని విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం తెలిపారు. గీతం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కేంద్రం ఆధ్వర్యాన సోమవారం నుంచి నిర్వహిస్తున్న నూతన ఆధ్యాపకుల అవగాహన తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బోధనతో పాటు పరిశోధనలలోను విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలపడానికి ప్రణాళికాయుతంగా కృషి చేస్తున్నామని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న నేపథ్యంలో అధ్యాపకులు బోధనా పద్దతులను విద్యార్థులకు తగిన విధంగా మార్చుకోవాలని సూచించారు. అధ్యాపకులలో అంకిత భావం, నూతన అంశాలను నేర్చుకోవాలన్న తపన అవసరమన్నారు.

బైకు ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, నాయకులు

చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-కొయ్యూరు

అమరావతిలో పేదలకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఇళ్ల పట్టాలు ఇవ్వడంపై టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కొయ్యూరులో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. కాకరపాడు నుంచి కొయ్యూరు జంక్షన్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజమండ్రిలో రెండు రోజుల పాటు నిర్వహించిన టిడిపి మహానాడును మాయనాడుగా మార్చేశారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఈ మహానాడులో మాయమాటలు చెప్పి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. మహానాడులో తీసుకున్న నిర్ణయాల్లేవీ ప్రజా సంక్షేమానికి ఉపయోగపడవని పేర్కొన్నారు. చక్కటి పాలన అందిస్తున్న జగన్మోహన్‌రెడ్డిపై అవాకులు చవాకులు పేలుతూ ప్రజలను చంద్రబాబు మోసం చేస్తున్నారని విమర్శించారు. టిడిపి అధికారంలోకొస్తే పేదలను ధనవంతులను చేస్తానని చెబుతున్న చంద్రబాబు 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎంత మంది పేదలను ధనికులుగా మార్చారో చెప్పాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పిటిసి వారా నూకరాజు, ఏఎంసీ చైర్మన్ జైతు రాజులమ్మ, వైస్ ఎంపీపీలు అప్పన్న వెంకటరమణ, అంబటి నూకాలమ్మ, వైసిపి నాయకులు గాడి నాగమణి, జల్లి బాబులు, బండి సుధాకర్, రేగటి ముసలి నాయుడు, గొడ్డేటి మహేష్, ధోని బాబ్జి, సుమర్ల సరస్వతి, సడ్డ సావిత్రి, గాడి సత్యనారాయణ, వనం బాబు, ధూపం శ్రీను, పొట్టిక శ్రీను, నేయుల గంగాధర్, నేయుల లక్ష్మణరావు, కుశల, నాగేంద్ర, రెడ్డి నాయుడు, పొట్టి శేఖర్, అచ్యుత్ పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జిల్లాలో జూన్‌లో జరగబోయే పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 2 నుంచి 10వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు విశాఖ జిల్లాలో మొత్తం 24 సెంటర్లలో 5981 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. ఉదయం 9.30 నుంచి 12:45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష జరుగు గంట ముందుగా మాత్రమే పరీక్షా కేంద్రం తెరవబడుతుందని, పరీక్ష ప్రారంభమయ్యే 10 నిమిషాలకు ముందు వరకు మాత్రమే అభ్యర్థులకు పరీక్షా కేంద్రంలోనికి ప్రవేశ అనుమతి ఉంటుందని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, డిజిటల్ పరికరాలు అనుమతించబడవన్నారు. ప్రతి ఒక్కరినీ విధిగా తనిఖీ చేసి పరీక్ష హాల్‌లోకి అనుమతించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలన్నారు. మంచినీటి సదుపాయం ఏర్పాటు చేయాలని జివిఎంసి అధికారులను ఆదేశించారు.

రైల్వే పాఠశాలను తొలగించొద్దు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దొండపర్తి రైల్వే కాలనీ (వైర్‌లెస్ కాలనీ)లో చిరకాలంగా కొనసాగుతున్న రైల్వే స్కూలును అక్కడి నుండి తొలగించాలనే నిర్ణయం దారుణమని, ఈ ప్రతిపాదనను రైల్వే శాఖ విరమించుకోవాలని పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం, పాఠశాల విద్యా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.లక్ష్మీనారాయణ, కెవి.రమణ, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

ఉపాధి రక్షణకు ఉధృత ఉద్యమం

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

కూలీలకు జీవనోపాధి కల్పించే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే మోడీ ప్రభుత్వ దుశ్చర్యలను పోరాటాల ద్వారా అడ్డుకోవాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. బడ్జెట్‌లో నిధుల కోత పెట్టడంతో వ్యవసాయ కూలీల పనిదినాలు తగ్గి, పనుల కోసం వలసలు వెళ్లాల్సిన పరిస్థితి రానుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఉపాధి హామీ చట్టాన్ని రక్షించాలంటూ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సిఐటియు సంయుక్తంగా అనకాపల్లి కలెక్టరేట్ వద్ద సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపర్చాలన్న ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలన్నారు. పాత పద్ధతిలో సమ్మర్ అలవెన్స్, మస్టర్ విధానం, ఇతర అలవెన్స్‌లు, పనిముట్లు వ్యవసాయ కూలీలకు అందజేయాలన్నారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు తగినట్లు కూలి పెంచేందుకు బడ్జెట్‌లో నిధులు పెంచకపోగా, రూ.30 వేల కోట్లు కోతపెట్టడం దారుణమన్నారు. ధనంతులకు బిజెపి ప్రభుత్వం రాయితీలు కల్పించి, పేదల ఉపాధి చట్టంపై దాడి చేస్తోందన్నారు. రోజుకు ఆరు వందల రూపాయల కూలి ఇవ్వాలన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న మాట్లాడుతూ ఉపాధి చట్టం రక్షణ కోసం కూలీలంతా పోరాడాలన్నారు. ఉపాధి కూలీలకు పనిదినాలు తగ్గించి, మేట్ల వ్యవస్థను రద్దు చేసి ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా ప్రభుత్వం బాధపెడుతోందన్నారు.

ధర్నాలో మాట్లాడుతున్న లోకనాథం

అధికారుల దృష్టికి సమస్యలు

ఉపాధి కూలీల ధర్నా శిబిరం వద్దకు డిఆర్ఒ వెంకటరమణ, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సందీప్ వచ్చారు. కూలీలు ఎదుర్కొంటున్న రోజువారీ సమస్యలను నాయకులు వారికి వివరించి వినతిపత్రం అందజేశారు. ఉపాధి కూలీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని డిఆర్ఒ, పీడీ హామీ ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి ఉపాధి కూలీలు ఈ ధర్నాకు తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి సత్యనారాయణ, గోవింద, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, ఉపాధ్యక్షులు ఆర్.రాము, కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ, దేముడునాయుడు, సోమినాయుడు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, కోశాధికారి జి.నాయినిబాబు, ఐద్వా జిల్లా కార్యదర్శి మాణిక్యం, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

రెజ్లర్లకు విశాల మద్దతు

లైంగిక వేధింపులకు పాల్పడ్డ భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్‌ను అరెస్టు చేయాలంటూ దేశ రాజధాని ఢిల్లీలో ఉద్యమిస్తున్న మహిళా రెజ్లర్లపై ఆదివారం జరిగిన పైశాచిక దాడిని ఖండిస్తూ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సోమవారం నిరసన కార్యక్రమాలు, ర్యాలీలు జరిగాయి. రెజ్లర్ల పోరాటానికి మద్దతు తెలుపుతూ పెద్దపెట్టున నినాదాలు చేశారు.

విశాఖ కలెక్టరేట్ : సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్ సింగ్ హోటల్ జంక్షన్ నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ భారతదేశ ప్రతిష్టను కుస్తీ పోటీల్లో విశ్వవ్యాప్తం చేసిన రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలంటూ నూతన పార్లమెంట్ భవనం ఎదుట నిరసనకు యత్నించిన రెజ్లర్లపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్బంధకాండ ప్రయోగించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. రెజ్లర్లను, వారికి మద్దతు తెలిపిన మహిళా సంఘాల నాయకులను అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పద్మ మాట్లాడుతూ బిజెపి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ న్యాయం చేయాలని కోరిన వారిపై దాడి చేయడం హేయమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బి.రమణి, వి.కృష్ణారావు, పివిఎస్‌బి.శ్రీనివాసరాజు, ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా, సిఐటియు నిరసన

ఐద్వా, సిఐటియు ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, సిఐటియు జిల్లా కార్యదర్శి పి.మణి మాట్లాడారు. మహిళా మల్ల యోధులు తమపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయని చెప్పినా బిజెపి ప్రభుత్వంలో చలనం లేదన్నారు. మహిళా రెజ్లర్లను బహిరంగంగా తక్కువ చేసి మాట్లాడటం, వారి ఫిర్యాదులను రాజకీయం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో ఎ.పుష్పాంజలి సాహు, కె.లక్ష్మి, సుజాత, సుమిత్ర, పద్మ, కుమారి పాల్గొన్నారు.

అనకాపల్లి : మహిళా రెజ్లర్లపై కేంద్ర ప్రభుత్వ నిర్బంధాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మహిళా రెజ్లర్లపై మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని వ్యతిరేకిస్తూ సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యాన స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రుత్తల శంకరరావు, జి.కోటేశ్వరరావు, నాయకులు ఆర్.రాము, వివి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి- కూనవరం

మండలంలోని పెదర్కూర్ పంచాయితీ పరిధి భగవాన్‌పురం గ్రామంలో పంచాయతీ నిధులతో తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. బోరుబావి తవ్వే పనులను స్థానిక సర్పంచ్ నాగమణి ఆధ్వర్యాన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు వేసవి కాలంలో మంచినీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారని, తాగునీటి ఎద్దడి నివారణకు బోరు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సమస్య పరిష్కారం చేసినందుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ అమ్మాజీ, బాబు బొర్రయ్య, పాయం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

యుపిఎస్‌సి సెమినార్ ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జరగబోయే యుపిఎస్‌సి సెమినార్‌ను యువత సద్వినియోగం చేసుకోవాలని విశాఖపట్నం సిటీ లా అండ్ ఆర్డర్ డిసిపి వి.విద్యాసాగర్ నాయుడు విజ్ఞప్తి చేశారు. సెమినార్ పోస్టర్‌ను అల్లూరి స్టడీ సర్కిల్ డైరెక్టర్ అభిమన్యుతో కలిసి తన కార్యాలయంలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత ప్రవర్తనే భవిష్యత్తును నిర్దేశిస్తుందన్నారు. యుపిఎస్‌సి పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు ఈ సెమినార్ సరైన మార్గనిర్దేశకం కాగలదని తెలిపారు.

హైదరాబాద్-కటక్ మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల అదనపు రద్దీని తగ్గించడానికి దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్-కటక్ మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని నిర్ణయించిందని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 07165 హైదరాబాద్-కటక్ ప్రత్యేక రైలు జూన్ 6, 13, 20, 27 తేదీలలో ప్రతి మంగళవారం రాత్రి 20.10 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి మరుసటి ఉదయం 09.05.గంటలకు దువ్వాడ చేరుకుని, 09.07కి బయలుదేరి సాయంత్రం 5.45కి కటక్ చేరుకుంటుంది. 07166 కటక్-హైదరాబాద్ ప్రత్యేక రైలు కటక్ నుంచి జూన్ 7, 14, 21, 28 తేదీలలో ప్రతి బుధవారం రాత్రి 10.30 గంటలకు కటక్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 07.35 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 07.37 గంటలకు బయలుదేరి రాత్రి 09:00 గంటలకు హైదరాబాద్ వెళుతుంది. ఈ రైళ్ళు సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్డు, చుత్రోడ్ మీదుగా ప్రయాణిస్తాయి.

ఐపిఎ సబ్ కమిటీ రిపోర్టు దగ్ధం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బిడబ్ల్యుఎన్‌సిపై కార్మిక వ్యతిరేక ఐపిఎ సబ్ కమిటీ రిపోర్టును రద్దు చేయాలంలూ సోమవారం పోర్టు ఎఒబి వద్ద కార్మిక సంఘాల ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. ఐపిఎ సబ్ కమిటీ రిపోర్టును సిఐటియు అనుబంధ యునైటెడ్ పోర్టు అండ్ డాక్ పాంప్లాయీస్ యూనియన్, విడిఎల్‌బి డాక్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ ద్వైపాక్షిక వేతన సంప్రదింపుల కమిటీలో యాజమాన్యం నుంచి 13 మంది, ట్రేడ్ యూనియన్ నుంచి 13 మంది ఉంటారన్నారు. మేజర్ పోర్టులో పనిచేస్తున్న కార్మికులకు ధరల పెరుగుదలకు అనుకూలంగా ఎంత జీతం ఉండాలో ఈ కమిటీలో నిర్ణయం చేస్తారన్నారు. అటువంటి కమిటీని కాదని ఐపిఎ యాజమాన్యం ఐదుగురు సభ్యులతో సబ్ కమిటీ వేసిందన్నారు. కార్మికుల పక్షాన ఉన్నవారు లేకుండా యాజమానులతోటే ఈ సబ్ కమిటీ వేయడం చట్ట వ్యతిరేకమన్నారు. సబ్ కమిటీల పేరుతో 2022 జనవరి 1 నుంచి అమలు కావాల్సిన వేతన ఒప్పందాన్ని వాయిదాలు వేస్తున్నారని మండిపడ్డారు. మోడీ ప్రభుత్వ విధానాలు ఎంతటి దుర్మార్గమైనవో వివరించారు. పోర్టు కార్మికులకు హాని తలపెట్టే చర్యలను మానుకోవాలన్నారు. కార్యక్రమంలో యునైటెడ్ పోర్టు డాక్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, సిహెచ్.త్రినాథ్,రెడ్డి, విడిఎల్‌బి డాక్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష, కార్యదర్శులు జె.సత్యనారాయణ, బి.లక్ష్మణరావు, గణేష్, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.